క్లుప్తంగా

వైభవంగా గిరి రథోత్సవం


సత్యసాయి రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి టౌన్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం పట్టణంలో సత్యసాయి గిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజు గిరి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ప్రశాంతినిలయం ముఖ ద్వారం వద్ద అందంగా అలంకరించి రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, శివాలయం వీధి, హనుమాన్ కూడలి, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా ఊరేగింపుగా ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఉత్సవంలో దేశ, విదేశీ భక్తులు అధికసఖ్యంలో పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి కవచం బహూకరణ


వెండి కవచంలో అమ్మవారు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో నూతనంగా నిర్మించిన త్రిపుర సుందరిదేవి అమ్మవారికి శుక్రవారం దాతలు బంధనాథం సూర్యప్రకాష్, ఉమా దంపతులు వెండి కవచాన్ని బహూకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరనారాయణ, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, కార్యదర్శి రామలింగయ్య, ఉపకార్యదర్శి నాయుడు, కోశాధికారి సూర్యనారాయణకు వెండి కవచాన్ని దాతలు అందించారు. ఈసందర్భంగా వెండి కవచాన్ని అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

కొండగుట్టల్లో విత్తు


కొండగుట్టల్లో విత్తనాలు నాటుతున్న దృశ్యం

కదిరి అర్బన్: మండలంలోని చవిటితండా కొండగుట్టల్లో శుక్రవారం హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కానుగ, సీతాఫలం విత్తనాలను నాటే కార్యక్రమం చేపట్టారు. ఏటా సంస్థ ఆధ్వర్యంలో విత్తనాలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం


రోగులకు భోజన ప్యాకెట్లు అందిస్తున్న వైద్యురాలు చంద్రిక

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్ ఆధ్వర్యంలో 380 మంది రోగులు, వారి సహాయకులకు భోజనం, వాటర్ ప్యాకెట్లను ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు చంద్రిక చేతుల మీదుగా అందించారు. గర్భిణులకు స్వీట్లు పంపిణీ చేశారు.

కార్పొరేట్ కబంధ హస్తాల్లో విద్యారంగం


మాట్లాడుతున్న జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు

ధర్మవరం అర్బన్: విద్యారంగం కార్పొరేట్ కబంధ హస్తాల్లో చిక్కుకుందని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు పేర్కొన్నారు. పట్టణంలోని సూర్య స్కూల్‌లో శుక్రవారం జేవీవీ పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం పూర్తిగా వ్యాపారమయమై కార్పొరేట్ల కబంధ హస్తాల్లో బందీ అయ్యి వాళ్లకు మాత్రమే లాభాలు తెచ్చే వనరుగా ఉందన్నారు. పాలకులు విద్య, వైద్యంతోపాటు అన్ని రంగాల్లోకి అశాస్త్రీయ భావాలను చొప్పిస్తూ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అపహాస్యం చేస్తూ చాందస వాదానికి బలం చేకూరుస్తున్నారన్నారు. పట్టణంలో ఈనెల 24న జనవిజ్ఞానవేదిక జిల్లా మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభలో రెండేళ్లలో జిల్లా వ్యాప్తంగా జేవీవీ నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించుకోవడంతోపాటు భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకుంటామన్నారు. జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు, సభ్యులు లోకేష్, సురేష్, బండారు మల్లికార్జున, మనోహర్, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరం నుంచి మామిళ్లపల్లి వైపునకు వెళ్లే రహదారి దుస్థితి


ధ్వంసమైన ధర్మవరం నుంచి దర్శనమల రహదారి

అద్దాల్లా అన్నారు... అధ్వానంగా మార్చేశారు!

ధర్మవరం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని రోడ్లన్నింటినీఅద్దాల్లా మారుస్తామంటూ పాలకులు ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. తర్వాత ప్యాచ్ వర్కులంటూ తూతూమంత్రంగా పనులు ముగించారు. దీంతో నెలలు గడవక ముందే రోడ్లన్నీ ధ్వంసమై కంకర తేలుతున్నాయి. నాసిరకం పనులు చేపట్టడం వల్లే రోడ్లకు ఈ పరిస్థితి నెలకొందని వాహన దారులు అంటున్నారు. గుంతల రహదారులపై ప్రయాణం నరకంగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఇసుక, గరుసు మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు గ్రామీణ రహదారులపై వెళుతుండడంతో రోడ్లన్నీ అధ్వానంగా మారుతున్నాయని చెబుతున్నారు.

రూ.లక్షలు వెచ్చించి.. నిరుపయోగంగా వదిలేసి


కనగానపల్లిలో వృథాగా ఉన్న ఇరిగేషన్ కార్యాలయ భవనం

మండల కేంద్రం కనగానపల్లిలో నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) ఏఈ కార్యాలయ భవనం నిరుపయోగంగా ఉంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పక్కన సుమారు రూ.20 లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ భవనాన్ని ఆ శాఖ అధికారులు ఇప్పటి వరకు వినియోగించుకోలేదు. దీంతో ఆ భవనం వినియోగంలోకి రాకనే శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి నెలకొంది.

– కనగానపల్లి:

ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్: మండలంలోని డా. బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూప్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ కేటగిరిలో 2, ఎస్సీ కేటగిరీలో 3 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వివరాలకు 9440918075 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బాబు పాలనలో ప్రజలకు ఇబ్బందులు


వంకరకుంటలో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు


నిడిమామిడిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మదిరేబైలు తండాలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి అర్బన్: సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. శుక్రవారం పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామంలో మండల కన్వీనర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ బాబుసాహెబ్ సర్పంచులు మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా సక్రమంగా ప్రజలకు అందించలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వలేదని, అమ్మకు వందనం అందరికీ ఇవ్వలేకపోయారన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఒక ఏడాది ఎగ్గొట్టారన్నారు. బాబు పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగనన్న గెలుపు నల్లేరు మీద నడకేనన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కుళ్లాయిరెడ్డి, లతాబాలు, యూత్ వింగ్ మండల ప్రెసిడెంట్ వినయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా వింగ్ మండల ప్రెసిడెంట్ శివానంద, రామచంద్రారెడ్డి, మస్తాన్‌సాబ్, గడ్డం చంద్ర, ధనుంజయనాయుడు, మార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కిష్టప్ప, బాబయ్య, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకటేషు, రవి, కృష్ణానాయక్, వెంకటరామిరెడ్డి, సూరి, నాగరాజు, భద్రా, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

సూపర్‌సిక్స్ పేరుతో బాబు మోసం

పుట్టపర్తి: సూపర్‌సిక్స్ పథకాల పేరుతో బాబు రాష్ట్ర ప్రజలను నిలువునా మోసగించారని వైఎస్సార్‌సీపీ బుక్కపట్నం మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప ధ్వజమెత్తారు. శుక్రవారం బుక్కపట్నం మండలం మదిరేబైలు తండాలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కొత్తకోట కేశప్ప నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటినా సూపర్‌సిక్స్ పథకాలను పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. 50 ఏళ్లకే పింఛన్, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాల అమలు ఊసే లేదన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ విజయ బాయి, గరికవారిపల్లి సర్పంచ్ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి లక్ష్మీనాయక్, నాయకులు కుళ్లాయినాయక్, బాలకృష్ణనాయక్, సోమశేఖరరెడ్డి, లింగప్పగారిపల్లి చంద్రమోహన్, రంగనాయక్, శివయ్య, గోవింద్, మల్లారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రహాస్, వార్డు సభ్యుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి నట్టేట ముంచిన బాబు

నల్లమాడ: ఎన్నికల వేళ సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి నట్టేట ముంచారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. శుక్రవారం వంకరకుంట గ్రామంలో మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ కుళ్లాయప్ప ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ పథకాలు అమలు చేయలేదని దుయ్యబట్టారు. 20 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ సాయం ఎగ్గొట్టిన చరిత్ర సీఎం చంద్రబాబుది కాగా వంద శాతం హామీలను అమలు చేసిన చూపించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, మండల ఉపాధ్యక్షులు కే. సూర్యనారాయణ, నాయకులు టీడీ విజయశేఖర్‌రెడ్డి, ఓబిరెడ్డి, దుద్దుకుంట వెంకటరెడ్డి, కుళ్లాయినాయక్, అరవిందరెడ్డి, కొక్కంటి సాంబశివారెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు నాగార్జునరెడ్డి, మండల కమిటీ సభ్యులు మట్టి చెన్నప్ప, చిన్నాగప్ప, ఎం. కేశప్ప, యర్ర సూరి, షంషీర్, ఎస్టీ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు రాజేంద్రనాయక్, సలీం, సర్పంచ్‌లు ప్రసాద్, బొజ్జేనాయక్, లింగమూర్తి, నాగరాజునాయుడు, హైదరాబాద్ ఓబిరెడ్డి, పాపిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్శింపల్లితండాలో సీసీరోడ్లు నిర్మించాలి

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం నార్శింపల్లి తండాలో సీసీరోడ్డు నిర్మించాలని తండావాసులు కోరారు. ఈ మేరకు తండావాసులు సుధాకర్‌నాయక్ తదితరులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద 4 నెలల క్రితం నార్శింపల్లితాండాలో సీసీ రోడ్లకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అయితే కొలతలు, ఎస్టిమేట్ పూర్తయినా రోడ్లు నిర్మించలేదని పేర్కొన్నారు. తండాలో రోడ్లు సరిగా లేకపోవడం, వర్షాకాలం కావడంతో చిన్న పిల్లలు, వృద్ధులు జారిపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ప్రజా సమస్యలు పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్ల నిర్మించాలని కోరారు.

యువకుడికి తీవ్ర గాయాలు

తనకల్లు: మండలంలోని చీకటిమానిపల్లి వద్ద ఉన్న జాతీయ రహదారి–42పై గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో హరి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామం సమీపంలోని పేపర్ మిల్లు దగ్గర హరి వస్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొని వేగంగా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు క్షతగాత్రున్ని తమ ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎల్లో బ్లింక్ లైట్ల ఏర్పాటు


రోడ్డు పక్కన కాషన్ బోర్డును ఏర్పాటు చేసిన దృశ్యం

ధర్మవరం రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం మామిళ్లపల్లి వైపు రహదారిపై ఎల్లో బ్లింక్ లైట్‌తో పాటు, కాషన్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రాత్రి సమయంలో వేగంగా వస్తున్న వాహనదారులకు మలుపులో బ్రిడ్జి ఉన్న విషయం తెలియదని, ఈ లైట్లు ఏర్పాటుతో ప్రమాద సూచిక బోర్డులు కనిపించడం ద్వారా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉండదన్నారు.

పరస్పరం కేసు నమోదు

కదిరి అర్బన్: అప్పు విషయమై ఇరువురి మధ్య జరిగిన గొడవపై పరస్పరం ఫిర్యాదు ఆధారంగా కేసులు నమెదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని ఆంజనేయస్వామి గుడిసమీపంలో నివాసం ఉంటున్న రామునాయక్ మారుతీనగర్‌లో ఉండే ఉదయ్‌కుమార్‌కు రూ.20 వేలు అప్పు ఇచ్చాడు. తీసుకున్న అప్పు ఇవ్వాలని ఎన్ని సార్లు అడిగినా ఉదయ్‌కుమార్ ఇవ్వలేదు. దీంతో రామునాయక్ ఉదయ్‌కుమార్ ఇంటివద్దకు వెళ్లగా అక్కడ అతను లేకపోవడంతో వారి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ఉదయ్‌కుమార్ తల్లిదండ్రులు గోవిందు, రామాంజనమ్మ, శ్రావణ్ తదితరులు రామునాయక్‌ను కులంపేరుతో దూషించి రోకలిబండతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమెదు చేశారు. ఇదే సంఘటనలో తమ ఇంటికి వచ్చి తమ కుమారుడు అప్పు తీసుకుని ఇవ్వలేని తనను తోసేసి తనపై దౌర్జన్యం చేశారని గోవిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామునాయక్, అతని అన్న వెంకటేష్‌నాయక్‌పై కేసు నమెదు చేశారు .

హాస్టల్ వార్డెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

గాండ్లపెంట: ఖాళీగా ఉన్న హాస్టల్ వార్డెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గిరిజన విద్యార్థి హక్కుల పోరాట సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బి రాంప్రసాద్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండలం కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా బీసీ హాస్టళ్ల నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఒక్కో హాస్టల్ వార్డెన్‌కు మూడు హాస్టళ్లను కేటాయించడంతో పర్యవేక్షణ కరువై విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. అవినీతికి పాల్పడుతున్న హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

కదిరి టౌన్: కుటాగుళ్ల 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం కదిరి పట్టణం, రూరల్, ముదిగుబ్బ, తలుపుల, గాండ్లపెంట, ఎన్‌పీకుంట, అమడగూరు,ఓడీచెరువు, నల్లమాడ మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈమేరకు విద్యుత్ శాఖ డీఈ జే మోసెస్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రైతులు, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ధర్మవరం: పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ లక్ష్మీనరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని రామ్‌నగర్ లోనున్న 132/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళకు తీవ్ర గాయాలు

రొళ్ల: సాగు చేసిన పూల తోటలో పూలను కోస్తుండగా అకస్మాత్తుగా చెట్టుకొమ్మ విరిగి మీద పడిన ఘటనలో కరియమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని నసేపల్లిగొల్లహట్టిలో కరియమ్మ తమ పొలంలో వేసిన పూల తోటలో పూలను కోస్తుండగా పొలంలో ఎండిన చెట్టు కొమ్మ కరియమ్మ తల మీద పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను శిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వానరానికి అంత్యక్రియలు

పరిగి: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని సేవామందిరం కూడలిలో శుక్రవారం హిందూపురం – మడకశిర ప్రధాన రహదారి పక్కన ఉన్న వానరాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. రోడ్డు పక్కన చనిపోయి ఉన్న వానరాన్ని గుర్తించిన స్థానికులు అలాగే వదిలేయకుండా ఖననం చేయాలని నిర్ణయించారు. వెంటనే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. సేవామందిరంలోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకుడు వాసుదేవరావు, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గిరిష్‌కుమార్ ఆధ్వర్యంలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశారు.

వరములివ్వు.. వరలక్ష్మీమాత


కదిరిలో పూజలందుకున్న మరకత మహాలక్ష్మి


ధర్మవరంలోని ఓ ఇంటిలో అలంకరణలో వరలక్ష్మి


గాజుల అలంకరణలో సాలేవీధి పెద్దమ్మతల్లి


ముదిగుబ్బలో పూజలందుకున్న మహాలక్ష్మి


కనగానపల్లి: అలంకరణలో వరలక్ష్మీ మాత


చెన్నేకొత్తపల్లిలో పూజలందుకున్న వరలక్ష్మీ మాత

కదిరి టౌన్: పట్టణంలో వర మహాలక్ష్మి వ్రత వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, శివాలయం, వాసవీమాత, మరకత మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మి వ్రతం రోజున పూజలు చేస్తే, లక్ష్మీకటాక్షం పొందుతారని, సిరి సంపదలు సకల ఐశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. పెద్దసంఖ్యలో భక్తులు మరమత మహాలక్ష్మిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తనకల్లు: మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మి వత్రాన్ని ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మిని పూజిస్తే అష్ట లక్ష్మి పూజలకు సమానమనే నమ్మకంతో కుటుంబ సభ్యులందరూ వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

బత్తలపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముష్టూరు శివాలయంలో వరలక్ష్మి వ్రతాన్ని చేపట్టారు. వేద పండితులు చంద్రశేఖర్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, ధనుంజయశర్మ వ్రతం విశిష్టతను తెలియజేశారు. స్థానిక వడ్డెర కాలనీలోని మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. సాయంత్ర అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండిరథంపై ఊరేగించారు. అదేవిధంగా లక్ష్మీనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు తమ ఇళ్లలో వ్రతాన్ని ఆచరించి కార్యక్రమానికి హాజరైన వారికి అన్నదానం చేపట్టారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలో శుక్రవారం పలువురు ఇళ్లల్లో మహిళలు వరలక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయాల్లో సైతం వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఇంటింటా అమ్మవారిని కొలువుదీర్చి పూజలు చేశారు. మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు అందించారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలేవీధిలో వెలసిన పెద్దమ్మతల్లికి శ్రావణ శుక్రవారం సందర్భంగా గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వెంకటేష్‌శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష మంగళద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. బుగ్గా వంశస్తులు, మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఇదిలా ఉండగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని దూది వత్తులతో అలంకరించారు. వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు పోలమడ రూప రాగిణి, కార్యదర్శి కాకుమాని కళ్యాణి తదితరులు రూ.10వేలు విలువ చేసే 25కేజీల దూది వత్తులను తీసుకుని అమ్మవారికి అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి పూజలు చేశారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలోని గణేశహరిహర ఆలయంలో శుక్రవారం మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ, వడి బియ్యం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

చెన్నేకొత్తపల్లి/కనగానపల్లి: చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఇళ్లల్లో వరలక్ష్మీ అమ్మవారిని కొలువుదీర్చి పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. పూజల అనంతరం నైవేద్యం సమర్పించారు. తోటి మహిళలకు పసుపు, కుంకమ, ఫల, పుష్పాలతో వాయనాలు అందజేశారు. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో కొల్లాపురమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బసంపల్లి సమీపంలో ఉన్న సద్గురు యోగి నారాయణ ఆశ్రమంలో సామూహిక ముత్తయిదు భాగ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆశ్రమంలో వరలక్ష్మి మాతను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం 108 మంది ముతైదువులకు సామూహిక ఒడిబియ్యం అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కనగానపల్లి, తగరకుంట, మామిళ్లపల్లి గ్రామాల్లోని పలు ఆలయాలతో పాటు ఇళ్లలో మహిళలు వరలక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజల నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మిమాత వ్రతాన్ని ఆచరించిన మహిళలు పలువురికి వాయనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


కదిరిలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు


బత్తలపల్లిలో మహాలక్ష్మీ అమ్మవారి ఉత్సవ విగ్రహ గ్రామోత్సవం